# అనురాగపుటంచుల్లో

## లక్ష్మీగాయత్రి

"టెలిగ్రాం" అన్నకేక విని వంటింట్లో పిల్లలకి అన్నాలు పెడుతున్న సీత ఒక్క పరుగున వెళ్ళింది.

మెసెంజర్ సంతకం పెట్టించుకుని టెలిగ్రాం యిచ్చి వెళ్ళిపోయాడు.

"మదర్ సీరియస్, స్టార్ట్ యిమ్మిడియట్లీ" – వేణు. అన్నవార్త చదవగానే కుప్పకూలిపోయింది.

ఈలోగా తల్లి వెనకాలే వచ్చిన పిల్లలు రమ, రాము యిద్దరూ సీత మంచంమీద కూలబడి ఏడుస్తుండటం చూసి బిక్కచచ్చిపోయారు

పెద్దది రమ నెమ్మదిగా దగ్గర కొచ్చి, ఏమైందమ్మా?" అంది. ఏడేళ్ల రాము అదే ప్రశ్నని వ్యక్తం చేస్తున్న ముఖంతో అక్క వెనకాలే నిలబడ్డాడు.

ఏడుపు మధ్యలో తలెత్తింది సీత. "అమ్మమ్మకి ఒంట్లో బాగా లేదుట! వెంటనే రమ్మనమని చిన్న మావయ్య టెలిగ్రాం యిచ్చాడు!" అంది కన్నీళ్లతో.

ఏదో సీరియస్‌గా వుందని అర్థమైంది రమకి. "అయితే సరే, వెళదాం..." సమస్యని పరిష్కరిస్తున్నట్టు కూతురి మాటలతో కర్తవ్యం గుర్తొచ్చింది సీతకి.. కన్నీళ్లు తుడుచుకుని లేస్తూ, "రమా, నువ్వూ తమ్ముడూ జాగ్రత్తగా వెళ్ళి నాన్నగారికి విషయం చెప్పి రాగలరా?" అంది.

'ఓ'! అంది రమ.

సీత భర్త విష్ణు ప్రసాద్ పనిచేస్తున్న ఆఫీసు అక్కడికి దగ్గరే! పిల్లలు గబగబా తినటం పూర్తిచేసి తండ్రి దగ్గరికి వెళ్లారు.

టెలిగ్రాం చూడగానే విష్ణుప్రసాద్ కూడా కంగారు పడ్డాడు. వెంటనే శెలవుపెట్టి పిల్లల్ని తీసుకుని యింటికి వచ్చాడు.

అతను ఊహించినట్టే శోకమూర్తిలా వుంది సీత! కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతోంది. ఏది సర్దాలో ఏది మానాలో తెలియక తికమక పడుతోంది.

భర్తని చూడగానే దుఃఖం పొంగి రాగా బావురుమంది!

"ఛ...ఛ... ఊరుకో! ఏమిటిది పిచ్చిదానిలా? మీ అమ్మగారికేం ఫర్వాలేదు. మనం వెళ్ళేసరికి కులాసాగా వుంటారు" అంటూ భార్యని ఓదార్చాడు విష్ణు.

సీత తృప్తికోసం పైకి అలా అన్నాడేగానీ మనసులో అతనికీ ఖంగారుగానే వుంది. సంవత్సరం క్రితం సీత తల్లి రామలక్ష్మమ్మకి చాలా చికాకుచేసి తగ్గింది. అప్పట్నించీ ఆవిడ నలతగానే వుంటోంది. ఆవిడ ఆరోగ్యాన్ని తల్చుకున్నప్పుడల్లా సీత కళ్ల నీళ్ళు నింపుకుంటూనే వుంది. ఇప్పుడు ఆవిడగాని అటూ యిటూ అయిందంటే అతి సున్నిత మనస్కురాలైన సీతకి అదో పెద్ద దెబ్బ అన్న విషయం అతనికి తెలుసు.

ప్రస్తుతానికి ఆలోచనల్ని వాయిదా వేసి కార్య రంగంలోకి దిగేడు విష్ణు!

"లే. మరి నీకూ నాకూ పిల్లలకీ తలో రెండు జతలూ యీ బేగ్‌లో పడెయ్యి! నేను బేంక్‌కి వెళ్ళి రెండు వందలు విత్ డ్రాచేసి తెస్తాను. యింట్లో డబ్బెయ్యో ఎంతో వుంది కదా! త్వరగా తెమిలి అందిన బస్సుకి వెళ్ళిపోదాం!సాయంత్రం గోదావరి దాకా ఆగేమంటే బెజవాడనుంచి బస్సు దొరకదు. ఊఁ. త్వరగా లే. మరి. నేను తొందరగా వెళ్ళొచ్చేస్తాను." అంటూ పెద్ద బేగ్ ఒకటి తెచ్చి సీత దగ్గర పడేసేడు.

భర్త అందించిన మనోధైర్యంతో లేచింది సీత. ఆమె పెట్టెలోంచి బట్టలు తీస్తుంటే బేంక్‌కి బయల్దేరి వెళ్లాడు విష్ణు. వాళ్ల బేంక్ బేలన్స్ ఏనాడూ ఐదారు వందలకి దాటదు. దాన్ని కనీసం వెయ్యిచేద్దామనే సీత ప్రయత్నం ఎప్పుడూ నిష్ప్రయోజన మవుతూనే వుంటుంది. "పోన్లే. మనకి అవసరమైనప్పుడు మరొకరి దగ్గర దేహీ అని చెయ్యి చాపనక్కర లేకుండా మన డబ్బే మనం వాడుకోగలుగుతున్నాం! దానికి సంతోషించు!" అని సీతని ఓదార్చుస్తుంటాడు విష్ణు.

విష్ణు డబ్బు తీసుకుని వచ్చేసరికి బట్టలు సర్ది, పిల్లల్ని తయారు చేసి రెడీగా వుంది సీత. ఇంట్లోవున్న డబ్బు కూడా తీసుకున్నాడు విష్ణు. ఈలోగా గబగబా కాస్త టీ పెట్టి తీసుకు వచ్చింది సీత. టీ తాగాక, ఆ కప్పులు కడిగి పెట్టేలోగా సామాను బైటపెట్టి తాళాలొట్టు, రెడీగా నిలబడ్డాడు విష్ణు. సీత రాగానే తాళాలు వేసుకుని బైల్దేరారు.

బస్ స్టాపు వేపు నడుస్తూనే, "ఆటోలో వెళ్ళిపోదామా" అని అడిగాడు విష్ణు.

ఆటోలో కాదు... వీలైతే విమానంలో ఎగిరి వెళ్ళిపోదామని వుంది సీతకి! కానీ.... నిమిషం ఆగి, "ఎందుకూ, బస్సేదైనా వస్తుందేమో కాస్సేపు చూద్దాం!" అంది సీత.

సీత మనసు విష్ణుకి తెలియనిది కాదు. పదకొండేళ్ళుగా తనను పెనవేసుకు పోయిన మాలతీ లత ఆమె!

ఎదురుగా వస్తున్న ఆటోని పిల్చి మాట్లాడేడు విష్ణు. "దా, లేట్ చేసేమంటే ఒకవేళ అక్కడ బస్సు రెడీగా వుంటే అందుకోలేం!" అన్నాడు.

సీత కళ్లలో నీరు అదిమి పెడుతూ ఆటో ఎక్కింది.


వాళ్ళు ఆర్టీసీ కాంప్లెక్స్ చేరేసరికి అదృష్ట వశాత్తు అక్కడ గుంటూరు ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా వుంది. గబగబా ఎక్కేశారు. మరో ఐదు నిమిషాల్లో బస్సు కదిలింది. నిస్త్రాణగా వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది సీత. ఆమెని చూస్తుంటే మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయి విష్ణుకి.

బెజవాడ దగ్గర చిన్న పల్లెలో పుట్టింది సీత. పౌరోహిత్యాన్నే నమ్ముకున్న సోమయాజులు గారి కడపటి సంతానంగా పుట్టిన సీత అందలం ఎక్కలేదు గానీ, కడసారపు కందిగింజని తల్లి చేసిన ముద్దుతో అపురూపంగా పెరిగింది. ఇద్దరన్నలూ, ఒక అక్క కంటె పూర్తి వ్యతిరేకంగా కుసుమ కోమల హృదయిని! అల్ప సంతోషి! సీతకి గమనింపుకి రాని చాలా విషయాలు చెబితే ఆమె బాధపడుతుందని తన గుండెల్లోనే దాచుకుంటూ వుంటాడు విష్ణు.

సీత పెద్దన్న సుందరం. ఉన్న వూళ్లోనే స్వంత యింట్లో కాపురం పెట్టి, పది మైళ్ల దూరాన వున్న బెజవాడ రోజూ వెళ్లొస్తూ అక్కడ ఉద్యోగం చేస్తున్నాడు. అతని తర్వాత అమ్మాయి వనజ బెజవాడలోనే వుంటోంది. ఆమె భర్త పెద్ద ఆఫీసరు. సీత చిన్నన్న వేణు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అన్నలు, అక్క దగ్గర తక్కువ స్థితిలో వున్నది సీతే! తను యింకా ఎదగాలన్న కాంక్ష వున్నా, మిగిలిన వాళ్ల ఉన్నతికి విచారించేది కాదు సీత. "అంతా ఆడదాని అదృష్టంలో వుంటుందండీ! మా అక్కా వదినలూ బంగారు పూజలు చేశారు! అందుకే అంతా బావున్నారు. నాకు మాత్రం ఏం లోటు? నేనూ బంగారు పూజే చేసుకున్నాను, తెలుసా? అందుకే బంగారం లాంటి మొగుడు దొరికాడు!" అంటుంది మెరుస్తున్న కళ్లతో.

సుంధరం మిగిలిన వాళ్లకంటె కాస్త మెత్తని వాడే! ఆ సంగతి గ్రహించే అతని భార్య కాత్యాయని పెళ్ళయిన మర్నాటి నించే సంసార రథపు పగ్గాల్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఆడబడుచుల్నీ అత్తగార్ని ఎవరి హద్దుల్లో వారిని నిలబెట్టింది. సీతకీ వనజకీ చేసే మర్యాదల్లో ఎంతో తేడా చూపిస్తుంది. సీతతో చాటుగా, "ఆవిడ ఆఫీసరు గారి పెళ్ళాం కదమ్మా! మనం మనం ఎలాగైనా సర్దుకు పోవచ్చు. మనం ఎలా వున్నప్పటికీ ఆవిడకి చెయ్యక పోతే బావుండదు కదా! రేప్పొద్దున్న మనకే

చెడ్డపేరు!" అంటుంది పిచ్చి సీతకి మాటల్లోని నిజాయితీ కూడా పట్టదు ఉత్త నాలుక చివరి మాటే చాలు, పొంగి పోతుంది. 'పెద్ద వదినకి మాత్రం నేనేమైనా ఎడమేమిటండీ? అక్కా అంతే,



నువ్వే తక్కువగా వున్నావే సీతా అంటూ ఎంతో యిధై పోతుంది. క్రిందిటేడు బావుందన్నానని దాని షిఫాన్ చీర యిచ్చెయ్యాలా?" అంటుంది

వెన్నలాంటి సీత మనసు చూస్తే జాలీ, ప్రేమా పొంగి వస్తాయి విష్ణుకి. పద్దెనిమిదేళ్ళ సీత విష్ణుని చేరిన మరుక్షణం నించే అతని వక్షస్థలాన తులసి మాలగా అమరి పోయింది. సీతని చూస్తుంటే విష్ణుకి ఒక్కోసారి మట్టిలో ఆడుకుంటూ పకపక నవ్వే పసిపాప గుర్తొస్తుంది. అరిందాలా సంసారాన్ని చక్కదిద్దే సీత, ఆత్మీయుల దగ్గర కొచ్చేసరికి పసిపాపే అయిపోతుంది విష్ణు ఆలోచిస్తున్నాడు.... సీత తండ్రి యిదివరకే పోయాడు యిప్పుడు తల్లి గనుక దాటేస్తే, ఆ తరం పూర్తిగా అంతరించి పోయి, సుందరం, వేణుల పెత్తనం వస్తుంది వనజ గడుసుది తల్లి మరణం అంటే కేవలం తల్లిలేని లోటునే తల్చుకుని తల్చుకుని కుమిలి పోయే సీత యీ లౌకిక విషయాలకి తట్టుకో గలదా? విష్ణు మరి ఆలోచించ దల్చుకోలేదు. ఏది ఎలా అయితే అలా అవుతుందన్న వేదాంతాన్ని ఆశ్రయించి వూరుకున్నాడు.

కళ్ళు మూసుకుని వెనక్కి జేరబడ్డ సీత కూడా అదే సమయంలో రక రకాల ఆలోచనలు, జ్ఞాపకాలతో సతమత మవుతోంది బాల్యం నించీ తన జీవితం ఎక్కువగా తల్లితోనే అల్లుకు పోయింది. తండ్రి ఎప్పుడూ సంసారాన్ని ఎలా పోషించాలా అన్న ఆలోచనతోనే సతమత మయేవాడు. తనను వాత్సల్యపు ఐశ్వర్యంతో ముంచి తేల్చినది తల్లే! తనని అన్నలూ, అక్కా "అమ్మకూచి" అని ఏడిపిస్తుండేవారు. 'ఇద్దరు పిల్లల తల్లైనా తను యిప్పటికీ అమ్మ కళ్ళకి పసి పాపలాగే కనిపిస్తుంటుంది.

'తనకి పదిహేడేళ్ల వయసులో తండ్రి పోయాడు. కాని అప్పుడు ఆ దుఃఖం తనకి అట్టే తెలియలేదు. కొంతవరకూ తన బాధని తల్లి పంచుకుని ఓదార్చింది. తరువాత, సంవత్సరంలోగా ఆడపిల్లకి పెళ్లి చేసేస్తే కన్యాదాన ఫలం కూడా దక్కుతుందని తనకి ఆదరా బాదరాగా విష్ణు ప్రసాద్‌తో పెళ్లి చేసేశారు. విష్ణు ప్రేమలో సర్వం మర్చి పోయింది తను. కాని యిప్పుడో.... అమ్మపోతే ఆ లోటుని తనకి ఎవరు తీర్చ గలరు? సంసార బాధ్యతలతో విసిగి పోయి విసిగిపోయి ఎప్పుడో ఒకసారి పుట్టింటికి వెళ్లినపుడు తనకి యిష్టమైనవన్నీ తల్లి వండి దగ్గర కూర్చుని "మరి కొంచెం వేసుకోవే, పిచ్చి పిల్లా ఎలా చిక్కిపోయావో చూడు!" అంటూ కొసరి కొసరి తినిపించినట్టు యింకెవరు తినిపిస్తారు? విష్ణు ప్రేమ తక్కువని కాదు ఒక్కోసారి అతనికి తిక్కరేగితే, "మనందరికీ అన్నీ వండి పెడ్తోంది అమ్మ కడుపు నిండా తింటోందా? రమా, రామూ, యివేళ మనం అమ్మకి దగ్గరుండి తినిపిద్దాం, రండర్రా" అంటాడు. పిల్లలకి మరి హుషారు రమ, రాము కళ్లు చేసి తన నోట్లో పెడతారు "అమ్మా, నువ్వే చంటి పాపాయి" అని వెక్కిరిస్తూ రాము తన వీపుమీద పడి వూగుతుంటే సర్వం మర్చిపోతుంది. కానీ... యివన్నీ చెప్పుకోవటానికి అమ్మ



ఇంటర్ విద్యార్థులారా!
1957 లో స్థాపించిన
రవి కళాశాల
[బ్రాడీపేట, గుంటూరు]
ఎన్నో వేలమంది ఇంజనీర్లను, డాక్టర్లను తయారుచేసి ఆంధ్రుల అభిమానం చూరగొన్న సంస్థ. ఇపుడు ఇంటర్, Bi.P. M.P. గ్రూపులతో చదివే వారి కోసం
రవి పోస్టల్ ట్యూషన్
ట్యూషన్స్, గైడ్స్ అవసరం లేకుండా ఇంటర్ పరీక్షలలోనే గాక ఎంట్రన్సుపరీక్షలలోకూడా నెగ్గటానికి ఎంతో ఉపయోగపడుతుంది. వివరాలకు రు. 5/-లు పంపండి.
సి. ఏ. ఎన్. ధన్,
డైరక్టర్.

## అనురాగపు టంచుల్లో

వుండద్సూ .?? తన మెడనీ, చేతుల్నీ చూసినపుడల్లా అక్క గాజులూ, గొలుసులూ గుర్తొచ్చి నిట్టూరుస్తుంది అమ్మ కాని తన భర్తనీ, సంసారాన్నీ చూసినపుడల్లా పొంగి పోతుంది. "పోన్లేమ్మా, రుక్మిణి తులసీదళానికి తూగిన కృష్ణుడు దొరికాడు నీకు. నీ భర్తా, పిల్లలే నీకు మణి మాణిక్యాలు!" అంటుంది. తనకి చెప్పిన కథలన్ని రమకీ, రామూకీ చెబుతూ, "ఇవన్నీ మీ అమ్మ చిన్నప్పుడు చెప్పేదాన్ని. మీ దొడ్డమ్మ వినేది కాదు గాని మీ అమ్మ కెంత యిష్టమో?! బుద్ధిగా నా ఒళ్లో కూర్చుని వినేది లేకపోతే నా తొడమీద తల పెట్టుకుని వింటూ నిద్రపోయేది." అంటూ ఆప్యాయంగా తన వేపు చూసే అమ్మ తను వెళ్లేసరికి పలకరించటానికైనా వుంటుందా?

మొదటి నించీ తను ఎక్కువగా అమ్మతోనే గడిపేది. మిగతా ప్రపంచంతో పోటీగా ఆధునికంగా అక్క పెరిగితే, అక్కకి అక్కర్లేని పాత రకపు ముగ్గులూ, పోతన భాగవతం, రకరకాల వంటలూ వీటిలో అమ్మే గురువుగా, స్నేహితురాలిగా, శ్రోతగా తను పెరిగింది ఇంక పెళ్లయ్యాక చెప్పనే అక్కర్లేదు. తన పురుళ్లూ, అమ్మ చేసిన సేవా పురుడైనప్పుడల్లా పుట్టిన బిడ్డని చూసి అమ్మ తన బాల్యాన్ని గుర్తు చెయ్యటం, వీటితో అమ్మకి మరింత దగ్గరైంది. శ్రావణ మాసం నోములూ, పిల్లల వేడుకలూ . అమ్మ నగలన్నీ హరించుకు పోగా తాతగారు అమ్మకి పెట్టిన నెక్లెస్ ఒక్కటి మిగిలింది అమ్మ దగ్గర ఏ వేడుక జరుపుకున్నా, ఏ పండగొచ్చినా ఆ నెక్లెస్‌ని తన కిచ్చేది అమ్మ ముత్యాలు, కెంపులు పొదిగిన ఆ నెక్లెస్‌కి జంట హంసల పతకం ఎంత బావుంటుందో? అక్క దాన్ని కేవలం ఒక ఖరీదైన ఆ భరణంలాగే చూసేది. కాని తను మాత్రం ఆ నెక్లెస్ పెట్టుకుంటే జంట హంసలు సున్నితంగా పట్టుకున్న తామరతూడులా అనుభూతి చెందుతుంది తనకి ఆ నగ అంటే వున్న ప్రత్యేకాభిమానం అమ్మకి తెలుసు అంచేత, తనకి యింకేమి నగలు లేవన్న జాలితోనూ ఆ నగని తనకే యిస్తుంటుంది అమ్మ

అమ్మ లేకపోతే యిన్ని యింకెన్ని కోల్పోవలసి వస్తుందో? తనింక పసిపాపలా ఎవరి దగ్గర ప్రవర్తించ గలదు? ఇంక అక్కే తనకి అమ్మ. దానికీ తన సున్నితత్వం చూస్తె కోపం. మొండిగా వుండమని కేక లేస్తుంది. అయినా, క్రిందటేడు అమ్మకి చికాకు చేసినప్పుడు తనని ఎంతలా ఓదార్చింది? కేకలేసి భోజనం పెట్టించింది పెద్దన్నయ్యా, చిన్నన్నయ్యా కూడా తనకి ధైర్యం చెప్పారు. ఇంక అన్నలే తనకి తండ్రి, అక్కే అమ్మ అవుతారేమో. కానీ.... కానీ ... సీత యింక ఆలోచించలేక కళ్లల్లో తిరుగుతున్న నీటిని అదిమి పెడుతూ కళ్ళు మరింత గట్టిగా మూసుకుంది

వాళ్ళు యిల్లు చేరేసరికి రాత్రి పన్నెండవుతోంది. ఇంట్లో పిల్లలు మాత్రం నిద్ర పోతున్నారు. రామలక్ష్మమ్మ పరిస్థితి చెరుపూ మరుపూగా వుంది సీత మేనమామ ఒకాయన, పెత్తల్లి ఒకావిడ చెరో మూలా కునికిపాట్లు పడుతున్నారు. సుందరం, కాత్యాయని, వేణు, వేణు భార్య లక్ష్మి, వనజ, వనజ భర్త నాగేంద్ర అంతా మేలుకునే వున్నారు.

తలుపు చప్పుడుకి వనజ తలుపు తీసింది. అక్కని చూస్తూనే, "అక్కా, అమ్మ కెలా వుందక్కా?" అంది సీత కళ్ల నీళ్లతో బేలగా. వనజ చెల్లెలి చెయ్యి పట్టుకుని దగ్గరగా తీసుకుంది. "ఇంక ఆశ లేదే. నువ్వొస్తావనే, నీ కోసమే ఆవిడ ప్రాణం నిలబడి నట్టుంది. రా, అమ్మని చూద్దువు గాని...." అంది కన్నీళ్లతోనే.

సీత ఏడుస్తూ అక్కతో వెళ్లింది రామలక్ష్మమ్మకి ఒంటిమీద తెలివి లేదు. సీత కుదిపినా తెలివి రాలేదు సీత ఏడుస్తూ అక్కని హత్తుకు పోయింది. వనజ చెల్లెల్ని ఓదారుస్తుండగా, కాత్యాయని కూడా వచ్చింది. తనూ కన్నీరు తుడుచుకుంటూ, "బాధపడకమ్మా, ఆవిడ పుణ్యాత్మురాలనుకో, యాతన అట్టే లేదు ..." అంది.

"బ్రతికినంత కాలం ఎవర్నీ పల్లెత్తు మాట అన్న పాపాన పోలేదు మరి...." అంది లక్ష్మి కన్నీటితోనే.

సీతని అందరూ ఓదార్చి యివతలికి తీసుకొచ్చారు. కాత్యాయని అంతకు ముందే చేసి వుంచిన ఉప్మా, వేడి కాఫీ తీసుకొచ్చి యిచ్చింది. సీత తిరస్కరిస్తుంటే, సుందరం, వేణు దెబ్బలాడారు.

"అమ్మతప్ప మేమెవరం లేమనుకున్నావా, నన్నూ వదిన్నే అమ్మా నాన్నా అనుకో!" అన్నాడు సుందరం.

"మొదట్నించీ ఉత్త పిచ్చి మొద్దు. పైగా కడసారపుది. అంచేత అమ్మ ప్రాణాలన్నీ దీని మీదే పెట్టుకు బ్రతికింది!" లక్ష్మితో అంది వనజ.

"ఆఁ! ఆవిడ సీత గురించే ఎక్కువ యిదైపోయే వారు! పాపం, సీతని కళ్లారా చూడగలిగితే అంతే చాలు! వెన్న లాంటి మనసు కదా, అత్తయ్యగారిది! ఏనాడూ నన్ను చిన్నమెత్తు మాట కూడా అన్న పాపాన పోలేదు!" అంది లక్ష్మి

"నాలుగు పురుళ్లయ్యాయా, నాకు? అమ్మ లేదనే లోటు లేకుండా అన్నీ ఆవిడే చేశారు. ఆవిడ లేకపోతే నిజంగా నాకు పెద్ద లోటే...." అంది కాత్యాయని.

అవతల సుందరం, వేణు కూడా ఏదో మాట్లాడుతున్నారు. అన్నీ మౌనంగా వింటున్నాడు విష్ణు

ఒక పావు గంట గడిచేసరికి రామలక్ష్మమ్మ మూలిగింది. అందరూ ఆవిడ దగ్గరకి పరిగెత్తారు

"అమ్మా, అమ్మా ." అంటూ కన్నీరు బిగబట్టుకుని తల్లిని కుదిపింది సీత

రామలక్ష్మమ్మ నెమ్మదిగా కళ్ళు తెరిచింది మరుక్షణం సీతని గుర్తించిన ఆనందం ఆవిడ కళ్లల్లో మెరిసింది "సీతా .." అని హీనంగా పలుకుతూ చెయ్యి చాపింది. సీతకి మరి దుఃఖం ఆగలేదు. తల్లి చెయ్యి అందుకుని అందులో ముఖం దాచుకుంది

రామలక్ష్మమ్మ సీత ముఖం నిమిరింది. "బాగున్నావా ?" అన్నట్టు చెయ్యెత్తి సైగ చేసింది. "బావున్నానమ్మా ." అంది సీత కన్నీళ్లతో

ఆవిడ విష్ణునీ పిల్లల్నీ కూడా చూసింది. శుష్కహాసంతో నే పరామర్శించింది

తర్వాత ఆవిడ చూపు క్షణకాలం సీత మొద మీద నిలిచింది. వెంటనే, పెద్ద కోడల్ని దగ్గరకి రమ్మని సైగ వేసి పిలిచింది

కాత్యాయని దగ్గరకి వచ్చింది!

"నా నెక్లెస్..." తీసుకురమ్మన్నట్టు సైగ చేసింది రామలక్ష్మమ్మ.

వెంటనే కాత్యాయని ముఖం మారి పోయింది! సపోర్ట్ కోసమన్నట్టు సుందరం వేపు చూసింది! సుందరం మొహం తిప్పుకున్నాడు!

"ఇప్పు డెందుకమ్మా అవన్నీ ." వేణు వారించ బోయాడు. రామలక్ష్మమ్మ వినలేదు! సీతా, విష్ణు కూడా వారించబోయారు. లాభం లేకపోయింది

కాత్యాయని గత్యంతరం లేనట్టు వెళ్ళి నెక్లెస్ తీసుకు వచ్చింది!

రామలక్ష్మమ్మ దాన్ని అందుకుని, సీత చేతిలో పెట్టింది "ఇప్పుడు యిదెందుకమ్మా నాకు? దీనికోసం వచ్చానా నేను. నువ్వు కులాసాగా వుంటే చాలమ్మా నాకు!" సీత ఏడుస్తూ అంది

రామలక్ష్మమ్మ కళ్ళల్లో నీరు మెరిసింది! వీల్లేదు, తీసుకోమన్నట్టు సైగ చేసింది.

'అక్కా, నువ్వైనా చెప్పు అమ్మకి. ఏమిటీ పిచ్చి పని..?" వనజ వేపు చూసిన సీత నిర్ఘాంత పోయింది. వనజ ముఖంలో అసహనం, అసంతృప్తి మెర మెర లాడుతున్నాయి

## గు(వ్ర)ణం!

ఒకరు పై మెట్టు మీదుంటే
ఓర్వలేని గుణం!
అదే మనిషి మనుగడకు
ప్రతిబంధకమయ్యే పెద్ద వ్రణం!!
ఈ వ్రణంతో బాధపడుతున్నారు
నేడెంతో మంది జనం!
ఈ గుణం మానుకుంటే
బ్రతుకంతా సుఖమయం!!

-లక్ష్మి శ్రీనివాసన్

"పిచ్చి కేముందిలే, సీతా! ఆవిడకి నీ కివ్వాలని పించింది, యిస్తోంది! తీసుకో, మంచిదేగా ? అంది వనజ

తొలిసారిగా నాలుక పలికే మాటల్లోని నిజాయితీని గుర్తించింది సీత. ఆమె మనసు మొద్దుబారి పోయింది!

సీత తేరుకునే సరికి, కాత్యాయని వేపు చూస్తూ, రాజా " ఏడి అన్నట్టు సైగ చేస్తోంది రామలక్ష్మమ్మ

రాజా సందరం పెద్ద కొడుకు! రామలక్ష్మమ్మ మొదటి మనవడు

"నిద్రపోతున్నాడు!" మామూలుగా సమాధానం చెప్పింది కాత్యాయని.

సుందరం ఊరుకోలేక పోయాడు. వెళ్ళి రాజాని లేపి తీసుకు వచ్చాడు. ఆప్యాయంగా ఆ కుర్రాడి తల నిమిరింది రామలక్ష్మమ్మ.

మరో ఐదు నిమిషాల్లో ఆవిడకి వెక్కిళ్ళు ప్రారంభించాయి కాసేపటికి పరిస్థితి విషమించింది. సీత మేనమామ, పెత్తల్లి లాభం లేదు దింపెయ్యమన్నారు. సుందరం తల పట్టుకున్నాడు. వేణు కాళ్ళ వైపు వెళ్ళాడు. ఇద్దరూ కలిసి అరుబైట చాపమీద దక్షిణ ముఖంగా తల్లిని పడుకోబెట్టారు. సుందరం తల్లి నోట్లో తులసి తీర్థం పోశాడు. అతి కష్టంమీద ఒక గుటక పడిందేమో! ఆవిడ ప్రాణం అనంతంలో కలిసి పోయింది.

అందరూ గొల్లుమన్నారు!

"అమ్మా ' గుండె లవిసిపోయేలా రోదిస్తోంది సీత.

"మాట్లాడమ్మా! అప్పుడే ఏం తొందరై పోయిందమ్మా నీకు . నన్ను నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్ళిపోయావే. అంటూ ఏడుస్తోంది

"సీతా ఊరుకో! కడసారి నువ్వు చూడ గలిగావు ఆ జ్ఞాపకాన్ని మనసులో భద్రపరుచుకో మీ అమ్మగారు నీ మనసులో చిరంజీవిగా వుంటారు! వూరుకో. " సీతని ఓదార్చాడు విష్ణు.

తెల్లవారి శవం వెళ్ళేదాకా ఎవరు ఏడుస్తున్నారో, ఎవరు తనని ఓదారుస్తున్నారో స్పృహ లేకుండానే గడిపింది సీత. శవాన్ని తీసుకు పోతున్నపుడు సీతని ఎవరూ పట్టలేక పోయారు "వదలండి, అమ్మ మరి


# సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

| | |
|---|---|
| ట్రాన్సిస్టర్ రేడియో | వెల రూ. 5.75 |
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | వెల రూ. 5.75 |
| హౌస్ వైరింగ్ | వెల రూ. 8.50 |
| మోటార్ రీవైండింగ్ Part I | వెల రూ. 11.50 |
| మోటార్ రీవైండింగ్ Part II | వెల రూ. 12.75 |
| T.V. మెకానిజం | వెల రూ. 15.00 |
| టేప్ రికార్డర్ | వెల రూ. 8.75 |
| మోటార్ మెకానిజం | వెల రూ. 8.75 |
| రెఫ్రిజిరేటర్ & ఏర్‌కండిషన్ | వెల రూ. 8.75 |

| | |
|---|---|
| మోడరన్ ఫోటోగ్రఫీ | వెల రూ. 18.50 |
| లేత్ వర్క్స్ | వెల రూ. 6.75 |
| గ్యాస్ & ఆర్క్ వెల్డింగ్ | వెల రూ. 7.50 |
| మెటల్ & షీట్ మెటల్ | వెల రూ. 6.25 |
| మోడరన్ టైలరింగ్-పురుషులు | వెల రూ. 10.50 |
| మోడరన్ టైలరింగ్-స్త్రీలు | వెల రూ. 9.50 |
| మోడరన్ టైలరింగ్-పిల్లలు | వెల రూ. 9.50 |
| కరాటే | వెల రూ. 14.75 |
| వీరకళ కుంగ్‌ఫూ | వెల రూ. 12.00 |
| వశీకరణము | వెల రూ. 9.50 |

అధునిక గొప్ప పరిశ్రమలను గూర్చి స్వచ్ఛ తెలుగులో చదివి ఆయా పరికరాలను గూర్చి, అవి చెడిపోవుటకు తగు కారణాలు, వాటిని నివారించు మార్గాలు, చిరకాలము ఉపకరణాలుగా పనిచేయుటకు తగిన ఉపాయాలు. చెడిన భాగాలను తీసివేసి రిపేరు చేయుట, క్రొత్తది బిగించుట ఎట్లు అన్న వివరాలన్నింటిని తగు పటాలతో వివరించు పారిశ్రామిక గ్రంథాలు. ఇవి టెకినికల్ కోర్స్ చదివే వారికి ఉపయోగపడు గొప్ప గ్రంథములు. పుస్తకమును కోరువారు పుస్తకము వెలతో రూ. 3.50 చేర్చి M.O పంపండి. వివరములకు : బాలాజీ పబ్లికేషన్స్,103 పైక్రాఫ్ట్స్ రోడ్డు, మద్రాసు-14 .

**BALAJI PUBLICATIONS**
**103, PYCROFTS ROAD MADRAS-600 014**

# ఈ 'వేమన' పద్యాలు




పాదమున నడుచు నరుడట
లేదనగా భూమిదిరుగు లెస్సగ తనకే
యేదైన హాని వచ్చిన
సాధన పాదంబు నడువ జరుగదు వేమా

## అనురాగపు టంచుల్లో

నాకు కనబడదు! మరి సీతా అని పిలవదు మళ్లీ చూస్తాను!" అంటూ శవం వెనక పరిగెత్తింది.

విష్ణు, వనజ కలిసి బలవంతంగా వెనక్కి లాక్కొచ్చారు సీతని. సీత ఏడుపుకి అంతు లేకుండా పోయింది అందరూ స్నానాలు చేశారు. సీతని బలవంతంగా లాక్కెళ్లి స్నానం చేయించారు కాఫీ యివ్వబోతే ససేమిరా వద్దంది సీత! విష్ణు లవంతం మీద ఎలాగో తాగింది! అది వెంటనే వాంతి అయిపోయింది

విష్ణు యింక ఊరుకోలేక పోయాడు! గదిలో పక్క వేసి, ఫాన్ వేసి, సీతని లాక్కొచ్చాడు

"సీతా! నా ముఖం చూసి చెప్పు, మీ అమ్మగారు తప్ప యింకెవరూ లేరా నీకు? నేను, పిల్లలు ఏమయిపోతా మనుకున్నావ్? కాసేపు పడుకో .." అంటూ బలవంతంగా పడుకో బెట్టాడు.

ఎలాగో ఓ పావు గంట పడుకుంది సీత. మరి పడుకోలేక లేచి బైటి కొచ్చింది. వంటింటివేపు నడుస్తున్నదల్లా వంటింట్లోంచి వినబడుతున్న మాటలు విని ఆగి పోయింది.

వంట చేస్తూ మాట్లాడుకుంటున్నారు, కాత్యాయనీ, లక్ష్మి.

"మొత్తానికి కోడళ్లం మనం గుర్తు రాలేదు, చూడు!" అంటోంది కాత్యాయని.

"కోడళ్లిందు కనుకుంటున్నావ్, తద్దినం వంటలు వండడానికే...." అంది లక్ష్మి.

"ముందుగా ఆ మాట బైట పెడితే మేమెక్కడ పడ నివ్వమనో గాబోలు చచ్చే క్షణం దాకా చెప్పలేదు చూడు, ముసలావిడ " అంది కాత్యాయని.

సీత నివ్వెర పోయింది! మరి వంటింట్లోకి వెళ్లే ప్రయత్నం మానుకుని వెనుదిరిగి సావిట్లోకి వెళ్లబోయి, మళ్లీ ఆగిపోయింది

"మొత్తానికి చివరి క్షణంలో వచ్చి ఐదు తులాలు జాక్‌పాట్ కొట్టేసింది చూడు, నీ చెల్లెలు! నువ్వూ వున్నావు. " అంటున్నాడు నాగేంద్ర.

బాగుంది. నేనేం కలగన్నానా? ఇంకా అమ్మ పోయాక అన్యయ్యమైనా జతహరి గురించి ఎత్తుతాడేమో, అమ్మ గుర్తుగా నాక్కావాలిరా అనడుగుదామను కున్నాను గాని! ఐనా, ఆవిడకి మొదట్నుంచీ అదంటేనే పక్షపాత బుద్ధి లెండి.. " అంది వనజ

'మీ మరిది చూడు, ఎంచక్కా పక్క వేసి ఆవిణ్ని పడుకో బెట్టాడో ."

"అయ్యో, అంత మాలక్ష్మిని వెంట బెట్టుకొస్తున్న పెళ్లానికి ఆ మాత్రం చెయ్యొద్దుటండీ... మీ మగాళ్లంతా యింతే"

"అయితే నీకో చిల్లిగవ్వ కూడా రాలేదు గదా.... నేన్నిన్ను తిడుతున్నానటోయ్

"మీరు వేరు ."

సీత తల గిర్రున తిరిగింది ఆ క్షణంలో సీత కనిపించింది యీ పయోముఖ విషకుంభాల మధ్య నించి సుదూర తీరాలకి వెళ్లిపోయిన తల్లి ఎంత అదృష్టవంతురాలా అని!

పన్నెండో రోజు దాకా క్షణం ఒక యుగంగా గడిపింది సీత. పన్నెండో రోజు భోజనాలయాక, బైల్దేరబోతూ, సుందరం దగ్గరకి వెళ్లింది. తను తెచ్చిన నెక్లెస్ అతని చేతుల్లో పెట్టి వంగి నమస్కారం చేసింది.

"చివరి క్షణాల్లో అమ్మని నొప్పించలేక తీసుకున్నాను గాని యిది నాకు వద్దన్నయ్యా! అమ్మ ఎక్కడున్నా యీ పిచ్చి సీతని మర్చిపోదు! ఆశీర్వదిస్తూనే వుంటుంది. ఆ నమ్మకం కలిగించే బలం చాలు నాకు!" అంది.

ఈ పన్నెండు రోజుల్లో గడించిన అనుభవాలతో కలిగిన గాంభీర్యంతో కొత్త సీతగా బైటి కొచ్చింది. తాను పుట్టి, పెరిగిన ఆ యింటిని మనసారా మరోసారి చూసుకుంది. భర్త, పిల్లలతో కలిసి తన యింటికి వచ్చేసింది.

ఆ రాత్రి నిద్ర పట్టని అశాంతిలో విష్ణు దగ్గరకి తీసుకున్నప్పుడు మాత్రం, మేకపోతు గాంభీర్య మంతా కరిగిపోగా, అతనికి హత్తుకు పోయి వెక్కి వెక్కి ఏడ్చింది.

"నాకింకా చాలా మంది ఉన్నారనుకున్నానండీ.... కానీ ఎవ్వరూ లేరు, మీరు తప్ప!" అంది.

విష్ణు ఏమీ మాట్లాడలేదు. సీతని మరింత ఒదారుస్తున్నట్టు గుండెలకి హత్తుకున్నాడు. కానీ మనసులో మాత్రం అనుకున్నాడు – "అనురాగ శిఖరాన్ని అధిరోహించి అంచున నిలబడి చూస్తే అవలి వైపు ధన దాహపు టగాధం కనిపిస్తుంది. దానిలో పడని మనం ధన్యులం సీతా!" ☐